క్లుప్తంగా

సీఎంను కలిసిన ప్రభుత్వ విప్ అడ్లూరి


సీఎంను కలిసిన విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

గొల్లపల్లి: సీఎం రేవంత్ రెడ్డిని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, పలువురు మంత్రులను హైదరాబాద్‌లో సోమవారం మర్యాద పూర్వకంగా కలిసినట్లు పేర్కొన్నారు.

రోడ్లు భవనాల శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే


మంత్రికి బొకే అందిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలో చెడిపోయిన రోడ్లు, పాడైన వంతెనలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాల వాణి జూనియర్ కళాశాల, సరస్వతి పాఠశాల, కౌసల్య తెలుగు పండిట్ కళాశాల వ్యవస్థాపకులు కాసుగంటి సుధాకర్‌రావు అనారోగ్యంతో బాధపడుతుండగా, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన సకాలంలో కోలు కోవాలని కోరారు.

హోంశాఖ సహాయమంత్రిని కలిసిన బీజేపీ నాయకులు


రాయపట్నం వద్ద బండి సంజయ్‌తో నాయకులు

ధర్మపురి: హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను బీజేపీ నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వెళ్తున్న బండి సంజయ్‌ని సోమవారం మండలంలోని రాయపట్నం జాతీయ రహదారి వద్ద బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మెట్‌పల్లి: హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన న్యాయవాది సంతోష్‌పై పోలీసులు దాడి చేయడాన్ని వ్యతిరేకిస్తూ పట్టణంలో సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి మాట్లాడుతూ దాడికి పాల్పడ్డ పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు వేణుగోపాల్, వెంకటనర్సయ్య, పుప్పాల భానుమూర్తి, తెడ్డు ఆనంద్, రాజేశ్వర్ గౌడ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వరద నీటితో కలిగే ఇబ్బందులు పరిష్కరిస్తాం


పనులు పరిశీలిస్తున్న కమిషనర్

మెట్‌పల్లి: వరద నీటితో ఎక్కడైనా సమస్యలు ఏర్పడితే తక్షణమే వాటిని పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ మోహన్ పేర్కొన్నారు. పట్టణంలోని వెల్లుల్ల రోడ్‌లోని పెట్రోల్ బంక్ వద్ద రోడ్డుపైన భారీగా వరద నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. దీనిపై పలువురు ఫిర్యాదు చేయడంతో సోమవారం కమిషనర్ సిబ్బంది అక్కడికి వెళ్లారు. వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి నీటిని తొలగించారు. ఆయన వెంట సిబ్బంది విష్ణు, ముజీం, నిజాం పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

జగిత్యాలరూరల్/ రాయికల్/పెగడపల్లి/సారంగాపూర్/ మల్యాల/గొల్లపల్లి: జిల్లా వ్యాప్తంగా మండలాల్లోని అన్ని గ్రామాల్లో సోమవారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కాచెల్లెలు, అన్నదమ్ముళ్లకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి తమ అనురాగాన్ని చాటుకున్నారు.

జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామ శివారులోని సాయిబాబా దేవాలయంలో సోమవారం పౌర్ణమిని పురస్కరించుకుని పెద్ద ఎత్తున భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

పెంపుడు కుక్కకు రాఖీ కట్టిన తోటికోడళ్లు

మల్యాల: రాఖీ పండుగను పురస్కరించుకుని తమ ఇంట్లోని పెంపుడు జంతువు కుక్కకు తోటి కోడళ్లు రాఖీ కట్టారు. తాటిపల్లి గ్రామానికి చెందిన తోటికోడళ్లు సూర పద్మ, సూర సునీత రాఖీ పండుగను పురస్కరించుకుని సోమవారం తాటిపల్లి గ్రామంలోని తమ పెంపుడు కుక్క (స్నూపీ) కూడా తమ తోబుట్టువుగా భావించి, స్నూపీకి బొట్టు పెట్టి, ముందటి రెండు కాళ్లకు రాఖీ కట్టి, స్వీటు తినిపించారు.

ముంబాయ్‌లో రాఖీ పౌర్ణమి వేడుకలు

జగిత్యాలరూరల్: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ముంబాయ్‌లో తెలంగాణ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోదరులకు సోదరిమణులు రాఖీలు కట్టి స్వీట్లు పంపిణీ చేశారు.

కరీంనగర్‌లోని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సతీమణి కాంత కుమారి వారి సోదరుడికి రాఖీ కట్టారు.


రాయికల్: రాఖీ వేడుకల్లో కుటుంబ సభ్యులు


తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క


తమ పెంపుడు కుక్కకి రాఖీ కట్టిన అక్కాచెల్లెలు


రేచపల్లిలో అన్నకు రాఖీ కడుతున్న చెల్లెలు


సోదరుడికి రాఖీ కడుతున్న కాంతాకుమారి

భక్తమార్కండేయ ఆలయంలో యజ్ఞోపవిధారణ


పెగడపల్లిలో మగ్గంపై వస్త్రంనేస్తూ ఊరేగుతున్న పద్మశాలీలు


జగిత్యాలలో సామూహిక యజ్ఞోపవిధారణ

జగిత్యాలటౌన్: విశ్వగాయత్రి పరివార్ ఆధ్వర్యంలో సామూహిక యజ్ఞోపవిధారణ, రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పద్మశాలీ సేవాసంఘం, విశ్వగాయత్రి పరివార్ ఆధ్వర్యంలో సోమవారం జగిత్యాల పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో సామూహిక యజ్ఞోపవిధారణతో పాటు రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. విశ్వగాయత్రి పరివార్ ఆధ్వర్యంలో మహిళలు పద్మశాలి సంఘం ప్రతినిధులు, భక్తమార్కండేయ ఆలయ భక్తులకు రాఖీలు కట్టి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం కార్యవర్గం, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా నూలు పౌర్ణమి వేడుకలు

పెగడపల్లి:మండలంలోని పెగడపల్లి, బతికపల్లి గ్రామాల్లో సోమవారం నూలు పౌర్ణమి వేడుకలను పద్మశాలీలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్ల, మంగళ వాయిద్యాలతో మహిళల కోలాటాలు, యువకుల నృత్యాలు చేస్తూ మగ్గంపై వస్త్రంనేస్తూ గ్రామాల్లో కలియతిరిగారు. అంతకు ముందు మార్కండేయ స్వామి ఆలయాల్లో సామూహిక యజ్ఞోపవీత ధారణ, అభిషేకాలు, అర్చనలు, జంజిరాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలీ సేవా సంఘం నాయకులు గాజుల నర్సయ్య, జంజురు రాజమల్లు, మల్లయ్య, వెంకటేశం, గంగాధర్, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.


ధర్మపురిలో జంధ్యధారణలో పద్మశాలీలు

ధర్మపురి: పట్టణంలోని గోదావరి ఒడ్డునున్న శ్రీ మార్కండేయస్వామి ఆలయంలో సోమవారం సామూహిక జంధ్యాల ధారణ ఘనంగా నిర్వహించారు, స్థానిక పద్మశాలీ సేవాసంఘం అధ్యక్షుడు నక్క రాజేందర్, ప్రధాన కార్యదర్శి కొంక వరప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం జంధ్యాల వితరణ, ధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భోగ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

మెట్‌పల్లి: పట్టణంలో కెమెరా క్లబ్ ఆధ్వర్యంలో వినూత్నంగా ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. సోమవారం కెమెరా సృష్టికర్త లూయిస్ డాగ్రే జయంతితో పాటు రాఖీ పౌర్ణమి ఉండడంతో.. క్లబ్ సభ్యులు కెమెరాకు, డాగ్రే చిత్రపటానికి రాఖీలు కట్టి సంబరాలు చేసుకున్నారు.

పట్టణంలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ ఫొటోగ్రాఫర్లను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఇల్లెందుల శ్రీనివాస్, గుండా రాకేశ్, వెల్మల శ్రీనివాస్‌రావు, నాంపల్లి వేణుగోపాల్, మహాజన్ నర్సింహులు తదితరులున్నారు.

ఇబ్రహీంపట్నం: జాతీయ ఫొటోగ్రఫీ దినోత్స వేడుకలు మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం మండల ఫొటోగ్రాఫర్స్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రాఫర్ల దినోత్సవ వ్యవస్థాపకులు లూయిస్ డాగ్రే చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నేమూరి ఏసురత్నం, సభ్యులు బొబ్బిలి అక్షయ్, మరళి, రాఘవేంద్ర, రాజుకుమార్, సురేందర్, లింగం, దీపక్, రాజేశ్, శ్రీకాంత్, నరేశ్, ప్రకాశ్ పాల్గొన్నారు.


వేడుకలో పాల్గొన్న క్లబ్ సభ్యులు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామ శివారులోని సహస్ర లింగాల దేవాలయంలో సోమవారం శ్రావణమాసం, పౌర్ణమి పురస్కరించుకుని పెద్ద ఎత్తున భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పెగడపల్లి: మండలంలో శ్రావణ మాసం వేడుకలు మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణ మాసం సోమవారం, రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆలయాలు సందడిగా మారాయి.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

మేడిపల్లి: బీఆర్ఎస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్ సహకారంతో, మేడిపల్లి మండలంలోని పోరుమల్ల గ్రామనికి చెందిన ఇందురి నవ్యకు రూ.14,500. గాజువేని వినోద్‌కు రూ.60,000. జగదీశ్వర చారికి రూ. 9,000 , రూపాయల చెక్కులను అందజేశారు. మండలంలోని కట్లకుంట గ్రామానికి చెందిన లక్ష్మణ్ రూ. 60,000. సాంబయ్య రూ. 60,000. గోపాల్ రెడ్డిరూ. 60.000 వేల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొనకంటి ఉమాదేవి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సల్లూరి నారాయణ గౌడ్, రాజ రత్నాకర్ రావు, ఏలేటి తిరుపతి రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అధికారికి సన్మానం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం మోరపల్లిలో విద్యుత్ జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీరాముల శ్రీనివాస్‌కు ఇటీవల అసిస్టెంట్ లైన్‌మెన్‌గా ప్రమోషన్ రాగా, సోమవారం శ్రీనివాస్‌ను సింగిల్ విండోచైర్మన్ మహిపాల్‌రెడ్డితో పాటు, పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డైరీ చైర్మన్ మల్లారెడ్డి, నాయకులు రాంమోహన్‌రెడ్డి, శేఖర్, ప్రకాశ్, ప్రమోద్, రాజేశం, రవి తదితరులు పాల్గొన్నారు.

సైనికులు దేశానికి సహోదరులు

జగిత్యాల: దేశ రక్షణ కోసం తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ దేశాన్ని, మనల్ని కంటికి రెప్పలా కాపాడే సైనికులందరూ అందరికీ సహోదరులేనని జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు విజయలక్ష్మి అన్నారు. హైదరాబాద్‌లో బందోబస్తు నిర్వహిస్తున్న సైనికులకు విజయలక్ష్మి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతీ ఒక్కరు దేశ ఐక్యత కోసం సోదరభావంతో మెలగాలని ఆకాంక్షించారు.

గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకోవాలి

రాయికల్: పట్టణంలో గృహలక్ష్మి పథకం కింద 200 యూనిట్ల కరెంట్ బిల్లు మాఫీ కానీ వారు మున్సిపల్ కార్యాలయంలో రేషన్, ఆధార్‌కార్డు, కరెంట్ బిల్లు తీసుకుని వచ్చి దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సారంగాపూర్‌లో రుణమాఫీ కాని రైతులు 310 మంది

సారంగాపూర్: సారంగాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో వివిధ కారణాలతో రుణమాఫీ కాని రైతులు 310 మంది రైతులు ఉన్నట్లు సంఘ సీఈవో లైశెట్టి శివకుమార్ తెలిపారు. రూ.లక్ష రుణమాఫీ అయిన రైతులు 174 మంది రైతులు ఉన్నారని, రూ.1.50 లక్షలు 90 మంది రైతులు, రూ.2 లక్షల లోపు రుణమాఫీ అయిన రైతులు 61 మంది ఉన్నారని తెలిపారు. ఈ రైతులకు మాఫీ అయిన మొత్తం రూ.2.46 కోట్లు అన్నారు. రుణమాఫీ అర్హత ఉండి మాఫీ కాని వారు ఉన్నారని, దీనిలో 61 మంది రైతులకు రేషన్‌కార్డు లేకపోవడంతో మాఫీ కాలేదన్నారు. 12 మంది ఆధార్, లోన్ అకౌంట్‌లో పేరులో తేడాతో ఆగిపోయాయని, మరో 14 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకం లేనివారు ఉన్నారన్నారు. మరో 215 మంది రైతులు రూ. 2 లక్షల కంటే ఎక్కువ రుణాలు ప్రభుత్వం రుణమాఫీ ఎలా జమ చేస్తుందన్న విషయంపై ఇంకా గైడ్‌లైన్స్ రావాల్సి ఉందని తెలిపారు.

కోరుట్లలో భారీ వర్షం

కోరుట్ల: పట్టణంలో సోమవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి ప్రకాశం రోడ్, ముత్యాల వాడ, రథాలపంపు ఏరియాల్లో నీరు నిలిచి రోడ్లపైకి చేరింది. ఆయా ప్రాంతాల్లో రోడ్లపైకి నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బురద నీటితో జనం ఇబ్బందులు పడ్డారు.

మేడిపల్లి: భీమారం మండలంలోని రాగోజీపేట, ఒడ్యాడ్, వెంకట్రావుపేట గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఒడ్యాడ్ చెరువు నిండుకుండను తలపిస్తోంది. పదేళ్ల తర్వాత అలుగు దూకుతుండగా గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


భీమారం మండలంలో కురిసిన వర్షం

మల్యాల: మండలంలో సోమవారం సాయంత్రం జోరువాన కురిసింది. సుమారు గంటపాటు వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనదారులకు గుంతలు కనపడక అందులో వాహనాలు పడి ఇబ్బందులు పడ్డారు.

గ్రామానికి వెళ్లాలంటే బురదరోడ్డే దిక్కు


బోర్నపల్లికి వెళ్లే బురదరోడ్డు ఇది..

రాయికల్: మండలంలోని బోర్నపల్లి గ్రామంలోకి వెళ్లాలంటే ఈ బురదరోడ్ల నుంచే వెళ్లాల్సిందే. వర్షం కురిస్తే నడవలేకపోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామంలో సీసీరోడ్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



పెగడపల్లి: మండలంలోని నామాపూర్ ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై ఏర్పడ్డ గుంతల్లో ప్రయాణం చేయాలంటే వాహనదారులు జంకుతున్నారు. ఇక్కడ కాళేశ్వరం లింక్ 2 ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో భాగంగా పైపులైన్ విస్తరణ కోసం రహదారి తవ్వి పైపులైన్ పనులు చేశారు. పనులు పూర్తయిన వెంటనే రహదారిని పునర్‌నిర్మించాల్సిన కాంట్రాక్టర్ మట్టిపోసి తారు వేయకుండానే వదిలేశారు. దీంతో ఈ రహదారిపై వర్షాలకు గుంతలు ఏర్పడి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీనివాస్,ఆర్‌అండ్‌బీ ఈఈ, ఫోన్ నంబర్: 9440818090

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9705346639

రైతులు, అధికారులకు రాఖీ కట్టిన ఏవో

మల్లాపూర్: రుణమాఫీ చేయాలని రైతులు చేపట్టిన రిలే దీక్ష శిబిరం రక్షాబంధన్ వేడుకలకు నిలయమైన సంఘటన మండలంలోని రాఘవపేటలో సోమవారం చోటు చేసుకుంది. రైతులు చేపట్టిన దీక్ష వద్దకి వెళ్లిన తహసీల్దార్ వీర్‌సింగ్, ఇన్‌చార్జి ఏడీఏ, ఏవో లావణ్య, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై కిరణ్‌కుమార్ రైతుల డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్న హామీ మేరకు ఆందోళన విరమించారు. రైతులకు సోదరిలాగ వ్యవహరించి తమ సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరడంతో ఇన్‌చార్జి ఏడీఏ, ఏవో లావణ్య రాఖీలు కట్టి అర్హులైన రైతులకు తప్పకుండా న్యాయం చేస్తామని తెలిపింది. అదే విధంగా తహసీల్దార్ వీర్‌సింగ్, సీఐ నిరంజన్ రెడ్డి, ఎస్సై కిరణ్‌కుమార్‌కు మహిళా రైతులు రాఖీలు కట్టి, రుణమాఫీ కాని వారందరికీ మాఫీ అయ్యేలా కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.


రాఘవపేటలో రైతులకు రాఖీ కడుతున్న ఇన్‌చార్జి ఏడీఏ, ఏవో లావణ్య

ప్రమాదానికి కారకుడైన వ్యక్తిపై కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల–ధర్మపురి ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కల్లెపెల్లి రాజేశ్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై తిరుపతి తెలిపారు. జగిత్యాల అర్బన్ మండలం గోపాల్‌రావుపేటకు చెందిన లైశెట్టి మధు తన స్నేహితుడు లైశెట్టి ప్రవీణ్‌తో కలిసి పని నిమిత్తం జగిత్యాలకు వచ్చి తిరిగి వెళ్తుండగా విద్యానగర్ సబ్‌స్టేషన్ వద్ద ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని కల్లెపెల్లి రాజేశ్ తన ద్విచక్ర వాహనంతో ఢీకొట్టాడు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం పైనున్న లైశెట్టి మధుకు తల, చేతికి బలమైన గాయాలయ్యాయి. బాధితుడి తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోరుట్ల:కోరుట్ల మండలం కల్లూర్ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.32వేలు స్వాధీనం చేసుకున్నట్లు కోరుట్ల సీఐ సురేష్‌బాబు తెలిపారు.

వెంగళాయిపేట యువకుడికి డాక్టరేట్

పెగడపల్లి: మండలంలోని వెంగళాయిపేట గ్రామానికి చెందిన గూడూరి కైలాసం డాక్టరేట్ పట్టా పొందాడు. ఉస్మానియా యూనివర్శిటీ నుంచి అర్థశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ డైసీ పర్యవేక్షణలో తెలంగాణ వ్యవసాయాభివృద్ధి, నీటి పారుదల అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ మేరకు డాక్టరేట్‌కు ఎంపికైన కైలాసం సోమవారం ప్రొఫెసర్ డైసీ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా పొందాడు. మారుమూల గ్రామం నుంచి డాక్టరేట్ పట్టా పొందిన కైలాసంను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సుధాకర్‌రెడ్డి, పురుషోత్తం, డాక్టర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ దూప దీపానికి విరాళం

మల్లాపూర్: మండల కేంద్రంలోని శ్రీ మల్లికార్జున ఆలయ దూపదీపం ఎన్ఆర్ఐ గెల్ల మల్లేశ్–రజిత దంపతులు సోమవారం రూ.12,192లను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు సంగ గంగరాజం మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అండగా నిలుస్తున్న గొర్రెపల్లికి చెందిన ఎన్ఆర్ఐ మల్లేశ్‌కు గ్రామప్రజల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు వేల్పుల రాజగంగరాజం, సభ్యులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలి

సారంగాపూర్: రూ.2 లక్షల లోపు అర్హత ఉండి రుణమాఫీ కాని రైతులు మంగళవారం (నేడు) రైతు వేదికల్లో దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయశాఖ సూచించింది. ప్రభుత్వం రూ. 2 లక్షల లోపు వరకు మూడు విడతల్లో రుణమాఫీ చేసినప్పటికీ అర్హత ఉండి వివిధ కారణాలతో రుణమాఫీ కాని రైతులు మంగళవారం దరఖాస్తులు అందజేయాలని సూచించింది, దరఖాస్తులు మీసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని రైతులు పూర్తి వివరాలతో నింపి అందించాలని పేర్కొన్నారు.

మురికి కూపంగా మాదిగ కుంట



రాయికల్: ఈ ఫొటోలో కన్పిస్తున్న మురికినీరు రాయికల్ పట్టణంలోని మాదిగ కుంటలో ఉన్న నీరు.. దోమలతో రాయికల్ పట్టణంలో చికెన్ గున్యా, డెంగీ, మలేరియా జ్వరాలతో బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికైనా మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ స్పందించి మాదిగ కుంటలో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని, దోమల నివారణకు కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఒర్రె పారింది.. రవాణా బంద్రైంది



కథలాపూర్: మండలంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురియడంతో మండలంలోని అంబారిపేట– తుర్తి గ్రామాల మధ్య ఒర్రెలో నీరు ఉధృతంగా పారింది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. తుర్తి శివారులో ఉన్న ఈ ఒర్రె వద్ద హై లెవెల్ కల్వర్టు నిర్మిస్తేనే సమస్య తీరుతుందని గ్రామస్తులు పేర్కొన్నారు.